క్లుప్తంగా

నేడు సాగు నీటి సరఫరా

కొత్తపేట: వంతుల వారీగా సాగు నీటి సరఫరాలో భాగంగా వాడపాలెం లాకు పైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానళ్లకు బుధవారం నుంచి నీరు సరఫరా చేస్తామని ఇరిగేషన్ శాఖ కొత్తపేట సెక్షన్ ఆఫీసర్ వి.నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకూ నీటి సరఫరా చేయనున్నట్టు వివరించారు. ఆయా చానళ్ల కింద రబీ వరి పంట సాగు చేస్తున్న రైతులందరూ పంట బోదెలను బాగు చేసుకుని, సాగునీటిని చివరి భూముల వరకూ వినియోగించుకోవాలని ఎస్‌ఓ నవీన్‌కుమార్ కోరారు.

లక్ష్మీగణపతి విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం


మామిడికుదురులో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: వాసంశెట్టివారిపాలెం హైస్కూల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయ విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. వాసంశెట్టి వెంకట రమాకాంత్ బాబు, కవిత దంపతులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వాచనం, అంకురార్పణ, గోపూజ, యాగశాల ప్రవేశం, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠ, మేళతాళాలు, 108 కలశలతో విగ్రహ ఊరేగింపు, జలాధివాసం తదితర పూజాది కార్యక్రమాలను వేద పండితులు జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి, మట్టపర్తి త్రిమూర్తులు, గంగారత్నం దంపతులు, వాసంశెట్టి వెంకట్రావు, ఓలేటి సత్యం ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు


సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు తెలిపారు. మంగళవారం ఆలయ ఈఓ బి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఆలయ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ కమిటీ సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. తొలుత ఆలయ పర్యవేక్షకులు తోరాటి శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధి ప్రణాళికను వినిపించారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ రమేష్‌రాజు హామీ ఇచ్చారు.

వాహనాల వేలంతో రూ.1.16 లక్షల ఆదాయం


వేలంపాటను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఖాదర్ బాషా

ఆలమూరు: ఆలమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలకు మంగళవారం వేలం జరిగింది. సీఐ ఎంఏ కదీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్ బాషా పర్యవేక్షించారు. ప్రస్తుతం ఎనిమిది వాహనాలకు వేలం వేయగా, అందులో ఏడు వాహనాలను మాత్రమే కొనుగోలు చేశారు. వీటి ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.16 ఆదాయం లభించగా, జీఎస్టీ ద్వారా రూ.20.8 వేలు దక్కనుంది. వాహనాలను వారం రోజుల్లో పాటదారులకు అందజేస్తారు. ఈ వేలంపాటలో ఐదు బైక్‌లు కాగా, మూడు స్కూటర్లు ఉన్నట్టు సీఐ కదీర్ తెలిపారు.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు స్థానిక అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన 25 ఏళ్ల కొడవటి అనంత సుబ్బలక్ష్మి తలలో రక్తం గడ్డ కట్టడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. వైద్యానికి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ఈమెకు తండ్రి లేరు. ఆమె బంధువులు సంస్థ సభ్యులను సాయం కోరడంతో, బాధితురాలి పెదనాన్న బసవ సత్యనారాయణకు రూ.20 వేలు అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆలమూరు: ప్రాథమిక పాఠశాల దశ నుంచి క్రమశిక్షణతో మెరుగైన విద్యాభ్యాసం చేసి ఉజ్వల భవిష్యత్తును పొందాలని రాష్ట్ర ఐ అండ్ ఐ ప్రత్యేక కార్యదర్శి తాళ్ల సత్యనారాయణమూర్తి అన్నారు. నర్సిపూడిలో మంగళవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారికి పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లను అందజేశారు.

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం


పెనికేరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


కె.పెదపూడిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వరలక్ష్మి

ఆలమూరు: రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని హక్కుగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టారని కొత్తపేట డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెనికేరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. పెదపళ్ల ప్రాథమిక వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన సుమారు 380 మందికి వైద్య సేవలు అందించారు. వివిధ రకాల రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. కంటి వెలుగు కార్యక్రమం కింద నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి 189 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు సూచనలు చేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నవారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. సర్పంచ్ వనుం చిన్నావతి జార్జ్ బాబు, ఎంపీటీసీ యనమదల స్వాతి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జె.అయ్యన్న, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్లు ఆర్.నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, ఆరోగ్యమిత్ర బల్ల వెంకటరమణ, ఫార్మాసిస్టు సుగుణలక్ష్మి, ఏఎన్‌ఎం టి.సుశీల, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

అంబాజీపేట: ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. కె.పెదపూడి పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వరలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలకు వైద్యం అందించి, వారి సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రోగులకు ఈసీజీ, షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. నేత్ర వైద్యులు ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరానికి సర్పంచ్ అడ్డంకులు

ఇలాఉండగా కె.పెదపూడి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తమను కార్యదర్శి సమాచారం ఇవ్వలేదంటూ సర్పంచ్ బీర శాంతి, వార్డు సభ్యుడు బీర రాజారావు అడ్డుకునేందుకు యత్నించారు. ఉదయం 9 గంటలకు సురక్ష శిబిరాన్ని నిర్వహించేందుకు వైద్య సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. తమకు ఏ విషయం చెప్పకుండా పంచాయతీ వద్ద శిబిరం ఎలా నిర్వహిస్తారు, కార్యదర్శి సమాధానం చెప్పే వరకూ శిబిరం నిర్వహించవద్దని భీష్మించారు. సుమారు రెండు గంటల సేపు రోగులకు వైద్య సేవలు అందకుండా అడ్డుకోవడంతో, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి జోక్యం చేసుకున్నారు. కార్యదర్శితో ఏమైన అభ్యంతరాలుంటే తర్వాత మాట్లాడుకోండి, ప్రస్తుతం శిబిరం నిర్వహించేందుకు సహకరించాలన్నారు. వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పడంతో శిబిరాన్ని ప్రారంభించారు. సమాచారం ఇవ్వలేదన్న నెపంతో ఈ కార్యక్రమానికి పంచాయతీ తరఫున ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుడు చిత్రపు సుబ్బారావు స్పందించి టెంట్లు, మంచినీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బిల్లులకు పంచాయతీలో తీర్మానం చేయడం లేదని, అందువల్లే ఏర్పాట్లు చేయలేకపోయామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

టీడీపీలో మాదిగలకు ఈసారీ నిరాశే..

సామాజిక వర్గ ముఖ్య నేతల ఆవేదన


అంబాజీపేటలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

అంబాజీపేట: మాదిగలకు టీడీపీ సముచిత స్థానం కేటాయిస్తుందని ఎదురు చూసిన మాదిగ సామాజిక వర్గానికి ఈసారి కూడా నిరాశే మిగిలిందని మాదిగ సామాజికవర్గ ముఖ్య నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేటలో వెంకట్రాజు ఆయిల్ అండ్ ఫ్లోర్‌మిల్ ఆవరణలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిషోర్ అధ్యక్షతన మాదిగ సామాజికవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2013లో వస్తున్నా మీకోసం పాదయాత్ర సందర్భంగా కడియం వద్ద.. మాదిగలకు జిల్లాలో ఒక ఎమ్మెల్యే సీటు కేటాయిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో మాదిగలకు సీటు కేటాయించలేదని పేర్కొన్నారు. 2016లో ఎమ్మెల్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ కూడా మాదిగలకు కేటాయించలేదన్నారు. అమలాపురం పార్లమెంటు పరిధిలో సుమారు 1.25 లక్షల ఓట్లు మాదిగలకు ఉన్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలోనూ 15 వేల నుంచి 20 వేల వరకు ఓట్లు ఉన్నాయని, అయినా ఎమ్మెల్యే సీటును టీడీపీ కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నేదునూరి వెంకట రమణబాబు, సవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పెదపూడి రాము, మంద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా ఉపాధి పనులు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ మధుసూదన్


కొత్తపేట ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వాణి

కొత్తపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఏమైనా స్వల్ప లోపాలుంటే సరిచేసుకుని, భవిష్యత్తులో చేపట్టే పనుల్లో వాటికి అవకాశం లేకుండా చేపట్టాలని డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ ఆ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీఓ వాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ పాల్గొన్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకూ మండలంలోని పది గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ శాఖలకు సంబంధించి 355 పనులు చేపట్టగా, వేతనాల రూపంలో రూ.6,78,77,654, మెటీరియల్ రూపంలో రూ.2,07,97,968తో మొత్తం రూ.8,86,75,622 ఖర్చు చేశారు. ఆయా పనులపై గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్స్ (వీఎస్ఏ) తనిఖీలు జరిపి, నివేదికలు రూపొందించారు. సర్వే నివేదికలపై ప్రజావేదికలో పీడీ మధుసూధన్ గ్రామాల వారీగా సమీక్షించారు. వివిధ పనుల్లో పలు లోపాలను గుర్తించారు. వాటిలో ఉపాధి పథకానికి సంబంధించి రూ.2,468 రికవరీ చేయాలని, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయనందుకు విడుదల చేసిన మొత్తంలో రూ.92,400 తిరిగి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఖండ్రిగ మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, ఖండ్రిగ వీడీపీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాస్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ కె.భీమేశ్వర్, పి.గన్నవరం, రామచంద్రపురం డ్వామా ఏపీడీలు జీవీకే మల్లికార్జునరావు, కె.సత్యనారాయణ, జిల్లా అంబుడ్స్‌మన్ అడపా వెంకటశ్రీనివాసరావు, ఏపీఓ ఎస్ ఆనంద్, డీఆర్‌పీలు, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మలికిపురం: కేశనపల్లిలో యెనుముల బ్రహ్మానందం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం యెనుముల బాపిరాజు వర్ధంతి సభను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద మాజీ సర్పంచ్ నిమ్మకాయల తపోబ్రహ్మం, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నివాళులర్పించారు. పాఠశాలలో టెన్త్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి 550 మార్కులతో నిలిచిన ఏ.మధు సుధారాణికి, గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫస్ట్ సాధించి 516 మార్కులతో నిలిచిన జి.సంధ్యకు, పడమటిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫస్ట్ సాధించిన యడ్ల స్వరూపారాణికి ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.

సేవల్లో స్వచ్ఛంద సంస్థలదే కీలక పాత్ర


రోగులకు దుస్తులు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అయినవిల్లి: ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు వంటి సందర్భాల్లో ముందుగా స్పందించి, సేవలందించేవి స్వచ్ఛంద సంస్థలేనని జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు అన్నారు. మంగళవారం ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా స్థానిక విలస గ్రామంలోని మన్నా మినిస్ట్రీస్ న్యూలైఫ్ సెంటర్(కుష్ఠు, హెచ్ఐవీ రోగుల పునరావాస కేంద్రం)లో సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్యఅతిథిగా అబ్బిరెడ్డి రాందాసు, ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత అబ్బిరెడ్డి సురేష్ హాజరయ్యారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పాతికేళ్ల సుదీర్ఘ కాలం పాటు సొసైటీ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. అనంతరం వ్యాధి పీడితులకు పండ్లు, రొట్టెలు, వస్త్రాలు పంపిణీ చేసి, భోజన ఏర్పాట్లు చేశారు. మాజీ జెడ్పీటీసీ గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, సామాజిక సేవకులు శిరంగు దొరబాబు, అబ్బిరెడ్డి మూర్తి, ఆకుల ఈశ్వరరావు, వల్లభరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద యోగా కేంద్ర సభ్యుల రక్తదానం


రాజమహేంద్రవరంలో రక్తదానం చేసిన రక్తదాతలతో శ్రీనివాస్

కొత్తపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక వివేకానంద యోగా శిక్షణా కేంద్రం సభ్యులు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశారు. అయినవిల్లి మండలం వెలవెలపల్లి గ్రామానికి చెందిన చిటికెన దుర్గాప్రసాద్ అనే వ్యక్తి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తరచూ తీవ్ర రక్తస్రావం అవుతుంది. దానితో ఇప్పటికే 40 ప్యాకెట్ల బ్లడ్ ఎక్కించారు. ప్రస్తుతం అతను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరలా అతనికి అత్యవసరంగా బ్లడ్ ఎక్కించాల్సి వచ్చింది. బాధిత దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు స్థానిక వివేకానంద యోగా శిక్షణా కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. శ్రీనివాస్ తన శిక్షణా కేంద్రంలో ఉన్న, పరిచయం ఉన్న రక్తదాతలు వానపల్లి భరత్, దంగేటి జగదీష్, మట్ట వెంకటరమణ, కె.దుర్గాలక్ష్మణ్, ఎల్.పవన్, ఎం.చంటి, ఎం.ఎను, పి.అనిల్, ఎం.కార్తీక్, పి.సుధీర్‌ను మంగళవారం రాజమహేంద్రవరం తీసుకువెళ్లి, రక్తదానం చేయించారు. ఆయనకు, రక్తదాతలకు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీరామ సప్తాహ మహోత్సవం


భజన కళాకారుడు శివరామ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: పినపళ్లలో వారం రోజులుగా జరుగుతున్న 28వ శ్రీరామ సప్తాహ మహోత్సవం మంగళవారం ముగిసింది. స్థానిక పల్లపు వీధి లోని మెండు వారి రామాలయం వద్ద గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రసిద్ధి చెందిన భక్త భజన బృందాలు విచ్చేసి, శ్రీరామ కీర్తనలు ఆలపించాయి. వాయిద్య కళాకారులు ఉండమట్ల ప్రసాద్, అలుగోజు శ్రీనివాస్ మృదంగం భక్తులను అలరించింది. సప్తాహంలో పూజలు నిర్వహించిన పత్రిని బుధవారం గౌతమీ గోదావరిలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది.

భజన కళాకారుడికి సత్కారం

పినపళ్లకు చెందిన శ్రీరామ భక్త భజన బృందం ప్రధాన కళాకారుడు, సుప్రభాత, పవళింపు సేవ వాగ్గేయకారుడు ఏపూరి శివరామ్‌కు శ్రీరామ సప్తాహం ముగింపు సందర్భంగా ఘన సత్కారం జరిగింది. సర్పంచ్ సంగిత సుభాష్, మాజీ ఉప సర్పంచ్ వక్కపట్ల లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నేత చామకూరి శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామస్తులు ఆయనకు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

వైజ్ఞానిక ప్రదర్శన

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సైన్స్ డే పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులు పలు అంశాలను ప్రదర్శించారు. ఐదో తరగతి విద్యార్థినులు జాహ్నవి, కీర్తి శ్యామల తదితరులు ఊపిరితిత్తులు ఎలా పనిచేస్తాయో వివరించారు. హెచ్‌ఎం పి.సోమసూర్యకుమారి, టీచర్లు కె.శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ఆలమూరు: మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు పి.సాలెంరాజు, ఎస్‌వీ సుబ్బరాజు కోరారు. వివిధ గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ పథకం తీరుతెన్నులను పరిశీలించారు, అలాగే రాగిజావను ప్రతి విద్యార్థి స్వీకరించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,

లోక్ అదాలత్ 16కు వాయిదా

కొత్తపేట: జాతీయ లోక్ అదాలత్ వచ్చే నెల 16వ తేదీకి వాయిదా పడిందని జూనియర్ సివిల్ జడ్జి భాస్కరరావు తెలిపారు. వచ్చే నెల 9న జరగాల్సిన ఈ లోక్ అదాలత్‌ను మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వాయిదా వేసినట్టు చెప్పారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్ణయం మేరకు మార్చి 16న నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకునేందుకు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గల్ఫ్ శెట్టిబలిజ సంస్థ సేవలు భేష్


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న శివకుమార్

రాజోలు: గల్ఫ్ శెట్టిబలిజ సేవా సంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. అనారోగ్యంతో, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పలువురికి సంస్థ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని ఆయన మంగళవారం అందజేశారు. ములికిపల్లి గ్రామానికి చెందిన పితాని వెంకటేశ్వరరావు(చిన్న)కు రూ.30 వేలు, మామిడికుదురు మండలం మొగలికుదురు గ్రామానికి చెందిన కమిడి మహేష్ రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్‌ను పలువురు అభినందించారు. బీసీ సంఘ నాయకులు గుబ్బల శ్రీనివాస్, బాబ్జి, బొక్కా ఏడుకొండలు, శివమణి, గెద్దాడ సూర్యనారాయణ, చెల్లింగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సత్యనారాయణ



అయినవిల్లి: అయినవిల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లవరం మండల తహసీల్దార్‌గా పనిచేసి, ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న అశోక్‌కుమార్ రాజోలు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.